క్లుప్తంగా

కార్తీకమాస ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం మూడో మంగళవారం కావడంతో అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో వచ్చారు. సామూహిక సత్యానారాయణ స్వామి వ్రతాలు చేశారు. నైవేద్యంగా బోనాలు సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పాలక మండలి సభ్యులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి పాడి పశువులు బలి



మృతి చెందిన పశువులు

కందుకూరు: విద్యుదాఘాతంతో రెండు పాడి పశువులు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండల పరిధిలోని కొత్తగూడ గ్రామంలో చోటు చేసుకుంది. మంగళవారం గ్రామానికి చెందిన గద్దగూటి భిక్షపతి ఆవు, గేదెను మేపడానికి పొలాలకు తీసుకెళ్లాడు. అవి మేసే క్రమంలో విద్యుత్ తీగ తెగిపడడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ దాదాపుగా రూ.1లక్షకు పైగా ఉంటుందని బాధితుడు లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వం నుంచి పరిహారం అందించి న్యాయం చేయాలని కోరుతున్నాడు.

వృద్ధులకు వైద్య శిబిరం

హుడాకాంప్లెక్స్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విజయపురికాలనీ భవన్‌లో సీనియర్ సిటిజన్స్‌కు మొబైల్ మెడికల్ కేర్ యూనిట్ ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో దాదాపు వంద మందికి బీపీ, షుగర్, కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సలహాదారు గోవర్ధన్, కాలనీ అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి, నిరంజన్‌రావు, రామ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మిచాంగ్'.. ముసురు



వర్షంలో ప్రయాణిస్తున్న వాహనదారులు

దిల్‌సుఖ్‌నగర్: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షంతో మలక్‌పేట జోన్ పరిధిలోని ప్రాంతాలు కాలనీల్లో నీరు నిలిచింది. మంగళవారం ఉదయం నుంచి ముసురు, చలిగాలులతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. వర్షం కారణంగా వాహనదారులు కొద్దిపాటి ఇబ్బందిపడ్డారు. మలక్‌పేట జోన్ పరిధిలోని దిల్ సుఖ్‌నగర్, మలక్‌పేట, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట, మున్సిపల్ కాలనీ, పద్మానగర్, కాలాడేరా, మలక్‌పేట రైల్వే బ్రిడ్జి, అజంపురా, సైదాబాద్ ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీల్లో కొద్దిపాటి వర్షం కురిసింది.

అందరికీ రుణపడి ఉంటా



దిల్‌సుఖ్‌నగర్: సబితారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు



హుడాకాంప్లెక్స్: ఎమ్మెల్యేను సత్కరిస్తున్న సరూర్‌నగర్ నాయకులు

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- కార్యకర్తలకు కృతజ్ఞతలు

దిల్‌సుఖ్‌నగర్: మంచి పాలన అందిస్తాననే నమ్మకంతో తనని నియోజకవర్గ ప్రజలు గెలిపించారని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఆమె మంగళవారం ఆర్‌కేపురం డివిజన్‌లో పర్యటించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఏర్పాటు చేసిన అభినందన సభలో సబితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన విజయం కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందు ఉంచుతానన్నారు. పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీ వాసులు, ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చి సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలిపి సన్మానం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, బాలకిషన్, నగేష్, సాజీద్, కొండల్‌రెడ్డి, మహేందర్‌యాదవ్, శ్యామల, శైలజ, ఊర్మిలారెడ్డి, సునీత పటేల్, శ్రీనివాస్, శేఖర్, శ్రీనివాస్, రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యంగిరా దేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నుంచి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపుపొందిన సబితారెడ్డి మంగళవారం ఆర్‌కేపురంలో కుర్తాళం పీఠం ప్రత్యంగిరా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు మహిమ గల దేవతని, దేశం నలుమూలల నుంచి భక్తులు దర్శించుకుంటారని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా ఆలయ సెక్రటరీ మునిపల్లి శ్రీనివాస్, సువర్ణలత దంపతులు సబితారెడ్డికి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.

ప్రత్యేక పూజలో..

ఆర్‌కేపురం డివిజన్ ఇన్ కమ్ టాక్స్ కాలనీలో కార్తీక మాసంలో భాగంగా లక్ష్మీనారాయణ స్వరూపం రాగి చెట్టు వేపచెట్టుకు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబితారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యేకు సత్కారం

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని సరూర్‌నగర్ బీఆర్‌ఎస్ నేతలు ఘనంగా సత్కరించారు. అసెంబ్లీ ఎన్నికలలో భారీ మెజారిటీ సాధించిన ఆమెను మంగళవారం సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మహేందర్ యాదవ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాలకిషన్, యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు కొండల్ రెడ్డి పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. రుషిగుప్తా, మల్లేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

సబితారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

కందుకూరు: మహేశ్వరం ఎమ్మెల్యేగా విజయం సాధించిన సబితారెడ్డిని కందుకూరు మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మంగళవారం నగరంలోని ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



సబితారెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రజాప్రతినిధులు



శ్రీపద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం

ముస్తాబైన ఆలయం

- నేటి నుంచే శ్రీపద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

మహేశ్వరం: మండలంలోని అమీర్‌పేట్ గ్రామంలో కొలువైన శ్రీ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి 15వ వార్షికోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలకు ఆలయం మొత్తం విద్యుద్దీపాలు, రంగులతో ముస్తాబైంది. ఏటా ఉత్సవాలను అంగరంగా వైభవంగా నిర్వహిస్తారు. గత కొన్నేళ్ల నుంచి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు విశేష ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం మహాగణపతి ఆరాధన, పుణ్యావచనము, రక్షాబంధనము, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, ప్రసాద వితరణ, మూలదేవత హోమము నిర్వహిస్తారు. గురువారం శ్రీవెంకటేశ్వరస్వామి వార్ల అభిషేకం, మూలదేవత హోమములు, ప్రసాద వితరణ, లక్ష్మీదేవి కుంకుమార్చన చేయనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

మరింత అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దినందుకే ప్రజలు తనకు పట్టంకట్టారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రెట్టింపు ఉత్సాహంతో మరింత అభివృద్ధి చేస్తానని ఎల్‌బీనగర్ శాసన సభ్యుడు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారితో కలిసి కంచర్ల శివారెడ్డి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌బీనగర్‌ను ఎంతో అభివృద్ధి చేశానని ఇంకా చేయాల్సింది ఎంతో ఉందని, తగిన ప్రణాళిక సిద్ధం చేసి అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నారగోని శ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ పద్మానాయక్, శ్రీనివాస్‌నాయక్, ఆదిలక్ష్మి, బాలం ఈశ్వర్, అనిత, విజయ పాల్గొన్నారు.



సుధీర్‌రెడ్డిని సత్కరిస్తున్న శివారెడ్డి, సత్యంచారి

నేడు అయోధ్య రామమందిర అక్షితల పంపిణీ

కాచిగూడ: శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 6న మధ్యాహ్నం 12 గంటలకు కాచిగూడ, శ్రీశ్యాంబాబా మందిర్‌లో శ్రీరామ పూజిత అక్షితల వితరణ ఉంటుందని భాగ్యనగర్ ప్రచారప్రముఖ్ భరత్ వంశీ మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, పీఠాధిపతులు, సాధుసంతుల చేతుల మీదుగా శ్రీ రామ అక్షింతలు అందజేయనున్నట్లు తెలిపారు.

చేవెళ్లలో విలక్షణ తీర్పు!

- సంబరాలకు దూరంగా గెలిచిన, ఓడిన నాయకులు
- నిరుత్సాహంలో కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు

చేవెళ్ల: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల ప్రజలు విలక్షణ తీర్పుతో అటూ గెలిచిన బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఇటూ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు సందిగ్ధంలో పడ్డారు. ఈ ఎన్నికల్లో ఇక్కడి ఓటర్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యేను గెలిపించుకున్నారు. రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్‌కే పట్టం కట్టారు. దీంతో చేవెళ్లలోని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు సంబరాలకు దూరంగా ఉన్నారు. విచిత్రమేమంటే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఓటమి పాలయితే, చేవెళ్లలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని జనం గెలిపించుకున్నారు. దీంతో ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యే సంబరాలు చేసుకునేందుకు సైతం వెనకడుగు వేస్తున్నారు. అటూ కాంగ్రెస్‌లోనూ ఇక్కడ అదే పరిస్థితి ఉంది. ఇన్ని రోజులు కష్టపడి పనిచేసిన పార్టీ ఎమ్మెల్యేను గెలిపించుకోలేకపోయిన బాధలో కార్యకర్తలు ఉంటే రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్‌కే ప్రజలు మద్దతు ఇచ్చి పట్టం కట్టారు. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టనుంది.

గెలిచిన ప్రతీసారి ప్రతిపక్ష ఎమ్మెల్యేనే అంటూ చర్చలు..

ఈ నియోజకవర్గంలో ఓటర్లు ఇచ్చే తీర్పు విలక్షణంగా ఉండడంతో ప్రతిపక్ష ఎమ్మెల్యేలే ఉంటారని అందరూ చర్చించుకుంటున్నారు. గత కొన్ని ఎన్నికలను పరిశీలిస్తే వారి వాదనలు నిజమనిపించక తప్పదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఇచ్చే తీర్పుకు చేవెళ్ల నియోజకవర్గంలో ఇచ్చే తీర్పు భిన్నంగానే ఉంటూ వస్తోంది. అధికారంలోకి వచ్చే పార్టీ ఎమ్మెల్యేను కాకుండా ప్రతిపక్షపార్టీ ఎమ్మెల్యేనే పలుమార్లు గెలిపించారు. ఇప్పుడు అదే తీర్పు మళ్లీ కొనసాగినట్లైంది. 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఇంద్రారెడ్డి గెలుపొందినప్పుడు రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చింది. కొన్ని నెలలకే ఆయన అకాల మరణంతో సతీమణి పి సబితారెడ్డి కాంగ్రెస్ నుంచి ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. ఆ తరువాత పునర్విభజనలో భాగంగా చేవెళ్ల ఎస్సీ రిజర్వు కావడంతో 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి కేఎస్ రత్నం ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. తెలంగాణ రాష్ట్ర విభజన అనంతరం 2014లో జరిగిన ఎన్నికల్లో కూడా టీఆర్‌ఎస్ నుంచి కేఎస్ రత్నం పోటీ చేస్తే కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కాలె యాదయ్యను గెలిపించారు. అప్పుడు రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఆయన కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరిపోయారు. ఆ అతరువాత 2018లో జరిగిన ఎన్నికల్లో మాత్రం అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్యను గెలిపించడంతో ఈ తీర్పు మారిందనుకున్నారు. కాని 2023 ఎన్నికల్లో మళ్లీ పాత తీర్పు రిపిట్ అయ్యిందని పలువురు చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్యను గెలిపించడంతో ఇక్కడి ప్రజల తీర్పు విలక్షణంగానే ఉంటుందని చర్చ జరుగుతుంది.



గుంతలమయంగా రోడ్లు



నాగోలు: మిచాంగ్ తుపాన్‌తో కురుసున్న వర్షాలకు ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు బస్తీలు, కాలనీల్లో అంతర్గత రహదారులు గుంతలు పడి బురదమయంగా మారాయి. నాగోలు డివిజన్ బండ్లగూడ చౌరస్తాలో కొద్ది రోజుల క్రితం జలమండలి అధికారులు డ్రైనేజీ కోసం రోడ్డును తవ్వారు. తుపాన్ వల్ల మంగళవారం కురిసిన వర్షానికి రోడ్డుపై మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి.

యాదగిరిగుట్టకు పాదయాత్రగా

- మల్‌రెడ్డి తనయుడు అభిషేక్‌రెడ్డి
- ఘన స్వాగతం పలుకుతున్న నేతలు

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి రంగారెడ్డి గెలవడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా మంగళవారం మల్‌రెడ్డి రంగారెడ్డి తనయుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. పది సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడంతో పాటు 40 ఏళ్ల తర్వాత ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. పార్టీ నాయకులు, మల్‌రెడ్డి అభిమానులు స్వాగతం పలుకుతున్నారు.



అభిషేక్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

వరికి వాన గండం..!

- తుఫాన్ తెచ్చిన తంటా
- వర్షంతో కోతలు ఆలస్యం
- వడ్లు తడిస్తే నష్టమంటున్న రైతులు



అమ్దాపూర్‌లో కోతకు సిద్ధంగా ఉన్న వరి



వెంకటాపూర్‌లో నేలకొరిగిన వరిపైరు

మొయినాబాద్: వరికి వాన గండం తప్పేటట్టు లేదు. వర్షం వల్ల వరి కోతలు ఆలస్యమయ్యేటట్లు కనిపిస్తుంది. ఈ సమయంలో ఇచాన్ తుఫాన్ ప్రభావం వరి కోతలపై పడిందని పలువురు రైతన్నలు ఆవేదన్య వ్యక్తం చేస్తున్నారు. రాత్రి నుంచే పలు చోట్ల వర్షాలు పడడంతో వరిచేను తడిసి కోతలకు ఇబ్బందిగా తయారైంది. మొయినాబాద్ మండలంలో సుమారు 3 వేల ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. వరి చేళ్లు ఇప్పుడే కోతకొచ్చాయి. ప్రస్తుతం కూలీల కొరతతో చాలా మంది రైతులు యంత్రాలతోనే కోతలు కోయించడానికి మొగ్గుచూపుతున్నారు. అందరివీ ఒకే సారి కోతకు రావడంతో తగినన్ని యంత్రాలు కూడా అందుబాటులో లేవు. ఉన్న యంత్రాలతోనే కోతలు చేయాల్సి వస్తుంది. ఒక్కో యంత్రం రోజుకు 8 -10 ఎకరాల కోత కోస్తుంది. దీంతో వరికోతలు ఆలస్యమయ్యే పరిస్థితులు ఉన్నాయని రైతన్నలు చెబుతున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడటం రైతన్నలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. చేతి కొచ్చిన పంట వర్షం పాలవుతుందని దిగులు పడుతున్నారు. కొద్ది పాటి వర్షం పడినా కోత కొచ్చిన చేను దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు మండలంలో తేలిక పాటి జల్లులు కురిశాయి. దీంతో వరిచేను నేలకొరిగాయి. మండలంలోని సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్, అమ్దాపూర్, నక్కలపల్లి, కేతిరెడ్డిపల్లి, ఎతర్‌బార్‌పల్లి, తోలుకట్ట, అప్పారెడ్డిగూడ, పెద్దమంగళారం, చందానగర్, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, చిన్నమంగళారం, మేడిపల్లి, చిలుకూరు, నాగిరెడ్డిగూడ, బాకారం, తదితర గ్రామాల్లో వరి అధికంగా వేశారు. ఇప్పటికే కొంత మంది రైతులు వరిచేను కోసి వడ్లను కుప్పలుగా పోశారు. వర్షం పడుతుండడంతో వడ్లు ఆరబోసే పరిస్థితి లేదు. తుఫాను ప్రభావం మూడు రోజులు ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కుప్పలుగా పోసిన వడ్లు ఆరబోయకపోతే మొలకెత్తుతాయని వారు చెబుతున్నారు. మరోవైపు వర్షం పడడంతో కోతకొచ్చిన చేళ్లలోకి యంత్రాలు వెళ్లడంలేదు. కోతలు ఆలస్యమైతే వడ్లు రాలి నేల పాలవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మెజార్టీ ఎలా తగ్గింది

- ఓటమిని జీర్ణించుకోలేకపోతున్న బీఆర్‌ఎస్ కేడర్
- పెద్ద లీడర్ల గ్రామాల్లోనే కారుకు తక్కువ ఓట్లు
- తప్పెక్కడ జరిగిందో తెలియక తలలు పట్టుకుంటున్న నేతలు
- పార్టీ మారే యోచనలో సీనియర్లు!



యాచారం: మంచిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు (ఫైల్)

యాచారం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఓటమిని బీఆర్‌ఎస్ కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. పోలింగ్‌కు ముందు మా గ్రామంలో మెజార్టీ వస్తుంది. బూత్ స్థాయిలో మనమే బలంగా ఉన్నాం, ఇతర పార్టీల వారు మనకు దరిదాపుల్లోకి కూడా రారంటూ బీరాలు పలికిన నేతలు ఆ గ్రామాల్లో కారు గుర్తుకు పడిన ఓట్లు చూసి బిత్తరపోతున్నారు. బూత్ స్థాయిలో విస్తృత ప్రచారం, నిత్యం విందు భోజనాలు, జేబు నిండా డబ్బు అందజేసినా.. మెజార్టీ మైనస్‌గా ఉండటం పట్ల కిందిస్థాయి కార్యకర్తలు తల్లడిల్లిపోతున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో 47,948 ఓటర్లు ఉండగా.. 38,489 ఓట్లు పోలయ్యాయి. యాచారం మండలంలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి ఫార్మా భూబాధిత గ్రామాల్లో బీఆర్‌ఎస్‌కు మెజార్టీ రాదని ముందు నుంచే అభిప్రాయం ఉన్నప్పటికీ డబ్బుతో వ్యతిరేకతను తగ్గించవచ్చనే అభిప్రాయం నెలకొంది. ఆ కోణంలో కూడ బీఆర్‌ఎస్ అధిష్టానం కృషి చేసింది. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో ఫార్మాసిటీ ప్రభావం, నస్దిక్‌సింగారం, నందివనపర్తి గ్రామాల్లో నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూముల కౌలు రైతులంతా కాంగ్రెస్‌కే మద్దతిచ్చారు. ఈ ఆరు గ్రామాల్లోనే కారు గుర్తుకంటే చేతి గుర్తుకు 3వేలకు పైగా మెజార్టీ వచ్చింది.

పేరున్న లీడర్ల గ్రామాల్లో తక్కువ ఓట్లు..

యాచారం మండలంలోని బీఆర్‌ఎస్ పెద్ద లీడర్లుగా పేరొందిన గ్రామాల్లోనే కారు గుర్తు కంటే చేతి గుర్తుకు అధిక ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్ గ్రామమైన మంతన్‌గౌరెల్లిలో చేతి గుర్తుకు 400కు పైగా మెజార్టీ వచ్చింది. ప్రధాన కార్యదర్శి పాశ్ఛ భాషా గ్రామమైన నక్కర్తమేడిపల్లిలో 200కు పైగా మెజార్టీ, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ గ్రామం మాల్‌లో 300కు పైగా మెజార్టీ, మాజీ ఎంపీపీ వర్క్యవత్ రజిత గ్రామం నందివనపర్తిలో 400కు పైగా మెజార్టీ, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి గ్రామం గునుగల్‌లో 250కు పైగా మెజార్టీ వచ్చింది. యాచారం గ్రామంలో చేతి గుర్తుకు ఏకంగా 600కు పైగానే మెజార్టీ వచ్చింది. అదే విధంగా బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులున్న గ్రామాల్లో కూడా కారు గుర్తు కంటే చేతిగుర్తుపై అత్యధికంగా ఓట్లు వచ్చాయి. గ్రామాల్లో పెద్ద లీడర్ల వన్‌మ్యాన్ షో.. ఇచ్చిన డబ్బులు కార్యకర్తలకు పంచకపోవడం , అంతా తాను చెప్పినట్లే వినాలనే గర్వం ఉండి సమన్వయం లేక కొంపముంచేలా చేసింది.

హస్తం గూటికి వెళ్దామా..

ఇన్నాళ్లు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అండతో గ్రామాల్లో వన్‌మ్యాన్ షోతో చెలరేగిపోయిన బీఆర్‌ఎస్ నేతల్లో కొందరు నాయకులు కారు దిగి హస్తం గూటికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఓటమిపాలైన మరుసటి రోజు నుంచే కాంగ్రెస్‌లోని పెద్దలతో మంతనాలు జరుపుతున్నట్లు మండలంలో చర్చ జరుగుతుంది. కారు దిగి కాంగ్రెస్‌లోకి వస్తే మళ్లీ మాకే సర్పంచ్‌లు, ఎంపీటీసీలుగా పోటీచేసే అవకాశం కల్పిస్తారా.. లేదా మరేదైన పదవులు దక్కుతాయా.. అంటూ కాంగ్రెస్ నేతలతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. గ్రామాల్లోని పెద్ద లీడర్ల వన్‌మ్యాన్ షోతో ఇబ్బందులు పడిన కిందిస్థాయి కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో ఉండి.. ప్రచారం నిర్వహించి చేతికి ఓటేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతిపక్షంలో ఉంటే ఇన్నాళ్ల మాదిరిగా పోలీస్, రెవెన్యూ, ఇతర ప్రభుత్వాధికారులు తమమాట వినరనే భయాందోళన కూడా బీఆర్‌ఎస్ నేతల్లో నెలకొంది. రోజుల్లో యాచారం మండలంలో ని పలు గ్రామాల నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నుంచి లబ్ధిపొందిన వారంతా కాంగ్రెస్‌లో చేరడానికి ప్ర యత్నాలు ముమ్మరం చేసుకుంటున్నట్లు సమాచారం.